# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 5, నవంబరు, 2014

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడుల శకం నడుస్తుందని, ఎక్కడ అనుకూలమైన వాతావరణం ఉంటే అక్కడ పెట్టుబడుల వెల్లువ వస్తుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. పారిశ్రామికీకరణతోనే ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన సాధ్యమని, కాబట్టి పెట్టుబడిదారులను ఆకర్షించడమంటే రాష్ట్రాన్ని బాగు చేసుకోవడమేనని ముఖ్యమంత్రి అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టే తెలంగాణ నూతన పారిశ్రామిక విధానం బిల్లు రూపకల్పనపై ముఖ్యమంత్రి సచివాలయంలో బుధవారం కసరత్తు జరిపారు. ప్రభుత్వ సలహదారు బివి.పాపారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, పరిశ్రమల శాఖ కార్యదర్శి ప్రదీప్‌చంద్ర, టిఎస్ఐఐసి యండి జయేష్ రంజన్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా పెట్టే సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయని, కొన్ని ప్రభుత్వాలు కూడా ప్రైవేటు సంస్థల మాదిరిగా పెట్టుబడులు పెడుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అవకాశాన్ని తెలంగాణ రాష్ట్రం సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తెలంగాణలో పరిశ్రమలకు అనుకూలమైన మంచి వాతావరణం, తక్కువ ధరల్లో వచ్చే భూములు, అపారమైన మానవ వనరులు ఉన్నాయని, వీటికి తోడు మంచి పారిశ్రామిక విధానం వస్తే హైదరాబాద్‌కు, తెలంగాణకు పెట్టుబడులు బాగా వస్తాయిని ముఖ్యమంత్రి చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ప్రొత్సాహం కలిగించే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం సింగిల్ విండో పారిశ్రామిక విధానాన్ని తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, దేశంలోని వివిధ రాష్ట్రాలు అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలను ముఖ్యమంత్రితో పాటు అధికారులు ఇప్పటికే అధ్యయనం చేశారు. పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి ప్రపంచలోనే ఇప్పటి దాకా అత్యుత్తమ పారిశ్రామిక విధానం అమలవుతున్నట్లుగా చెప్పే సింగపూర్ కూడా పర్యటించి వచ్చారు. ఆ అనుభవాల సారంతో తెలంగాణ నూతన పారిశ్రామిక విధానం రూపకల్పన జరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాల భయం కాని,

పెనుతుఫాన్ల భయం కాని తెలంగాణకు లేదని, కాబట్టి చాలా మంది పారిశ్రామికవేత్తలు తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారన్నారు. తాము తీసుకువచ్చే పారిశ్రామిక విధానం ప్రపంచంలోనే అత్యున్నత విధానంగా ఉంటుందని చెప్పారు. అనుమతుల కోసం నిర్ణీత సమయాన్ని గడువుగా విధించే నిబంధన కూడా ఇప్పటివరకు ఏ దేశంలో కాని, ఏ రాష్ట్రంలో కాని పెట్టలేదు. కాని మొదటి సారిగా తెలంగాణ పారిశ్రామిక విధానంలో అనుమతులను సరళతరం చేయడంతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో అనుమతులు వచ్చే విధంగా నిబంధన పెడతామన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం